క్లుప్తంగా

వరి కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు గురువారం తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని ఇప్పటికి కొనుగోలు చేయలేదని పలువురు రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో ధాన్యం మొత్తం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆర్‌ఐ గోపాల్, ఏఈవో లావణ్య, రైతులు ఉన్నారు.

'అప్రకటిత కోతలు లేవు'

సాక్షి స్పందన

దహెగాం: మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలు లేవని ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ అన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు శీర్షిక గురువారం 'సాక్షి' లో కథనం ప్రచురితమైంది. దీనికి ఆయన స్పందించారు. సబ్‌స్టేషన్ వద్ద పొదలను తొలగించే కార్యక్రమం చేపట్టినందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మండల వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

వాంతులు, విరేచనాలతో ఒకరి మృతి!



లక్ష్మిబాయి (ఫైల్)

కెరమెరి: మండలంలోని ఖైరీ నాయకపుగూడ గ్రామానికి చెందిన గుండి లక్ష్మిబాయి (65) వాంతులు, విరేచనాలతో గురువారం మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామంలో రెండు రోజులు క్రితం వివాహం జరిగింది. ఆ వివాహంలో పాల్గొన్నది.. అనంతరం ఇంటికి రాగా బుధవారం వాంతులు, వీరేనాలు చేసింది. గురువారం ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త రాజు ఉండగా ముగ్గురు కూతుళ్లు ఒక కొడుకు ఉన్నాడు.

నేడు విద్యుత్ అంతరాయం

కౌటాల: సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ నుంచి లోనవెల్లి సబ్‌స్టేషన్ వరకు 33 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌లో మరమ్మతు, మెయింటనెన్స్ వర్క్ పనులు ఉండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి ఉదయం 11.30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల వినియోగదారులు గమనించాలని కోరారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మొక్కలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేశ్‌బాబు

దహెగాం: గ్రామాల్లోని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. మండలంలోని గెర్రె, గిరవెల్లి, కర్జి పంచాయతీల్లోని నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతివనాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. పల్లె ప్రకృతివనాల్లోని మొక్కలను సంరక్షించాలన్నారు. వర్షాకాలంలో హరితహారం కింద నాటడానికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వంతెన పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: వంతెన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని అప్పపల్లి వాగుపై వంతెన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరలో పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నాయకుడు బాపురావు ఉన్నారు.

ఒంటికీ రెంటికీ తిప్పలు..

- కొటా గ్రామంలో మరుగుదొడ్లు లేవు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని పాలకులు

ఇంటింటికీ మరుగుదొడ్లు అనే నినాదంతో గత ప్రభుత్వం ప్రచారం చేసినా అనేక గ్రామాల్లో లేవు. మండలంలోని పరంధోళి గ్రామ పంచాయతీలోని కొటా గ్రామమే ఇందుకు నిదర్శనం. మొత్తం 110 కుటుంబాల్లో కేవలం 20 మందికి మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. మిగిలినవారు ఒంటికి, రెంటికి తిప్పలు పడుతున్నారు. దీంతో చేసేదేమి లేక పొలం గట్ల మీద లేదా చెరువుల కట్టపై వెళ్లాల్సిన పరిస్థితి.



చీరలు, తడకలతో కట్టిన స్నానపు గది

కెరమెరి: ఆ గ్రామం ఇటు తెలంగాణ.. అటు మహారాష్ట్ర పరిధిలో ఉంది. రెండు రాష్ట్రాల పాలనతో ఉందంటే అన్ని సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయని అందరూ భావిస్తారు. కాని అక్కడ అనేక సమస్యలతోపాటు ప్రధానమైనది మరుగుదొడ్లు లేవు. అదే పరంధోళి గ్రామ పంచాయతీలోని కొటా గ్రామం. ఆ గ్రామంలో 110 కుటుంబాలు ఉన్నాయి. 554 మంది జనాభా ఉంది.

బహిర్భూమికి బయటికే!

ఏళ్ల నుంచి బసచేసిన గ్రామం అది. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా వారి జీవన స్థితిగతుల్లో ఎలాంటి మార్పు లేదు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పాలిస్తున్నా.. మరుగుదొడ్లు కేవలం 20 మందికి మాత్రమే ఉన్నాయి. మిగిలిన 90 మంది ఒంటికీ, రెంటికీ బయటకు వెళ్లడం తప్పడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం అతి కొద్దిమందికి మంజూరు చేసినప్పటికి అవి కూడా నిరుపయోగంగా మారాయి. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని వారు పేర్కొంటున్నారు. వానాకాలంలో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు.

మంజూరు కాని మరుగుదొడ్లు..

గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు మంజూరు చేసినట్లు చెబుతున్నా ఆ గ్రామంపై అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా ఇరు ప్రభుత్వాల వైపు నుంచి మరుగుదొడ్లు మంజూరు కాలేదు. ఆ గ్రామానికి చెందిన వారు అందరు ఐఎస్‌ఎల్ కోసం దరఖాస్తులు చేశారు. మంజూరులో నిర్లక్ష్యం చేశారు. దీంతో చేసేదేమిలేక కొందరు తడకలు, మరికొందరు చీరలు చుట్టుకొని స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దరఖాస్తు అందించాను



మరుగుదొడ్డి కోసం పలుమార్లు దరఖాస్తు అందించాను. ఇప్పటికి మంజూరు కాలేదు. చీరెలు, తడకలు చుట్టుకొని తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపుగదులు ఏర్పాటు చేశాం. అధికారులు పట్టించుకోవాలి.

– గోప్లె బాపూరావు, కోటా

మంజూరు కాలేదు



మరుగుదొడ్ల మంజూరు లేదు. టాయిలెట్లు కావల్సిన వారు కలెక్టర్‌కు దరఖాస్తులు చేయాలి. మంజూరుకు ప్రక్రియ ప్రారంభమైతే అర్హులందరికీ అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి మంజూరు లేదు. – మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

ఫ్లోరింగ్‌కు మరమ్మతు చేపట్టాలి

రెబ్బెన: రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్లోరింగ్‌కు మరమ్మతు చేపట్టాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. జిల్లాకేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెబ్బెన జూనియర్ కళాశాలలో ప్రతిఏటా సుమారు 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. ఏటా ఇంటర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. అంకితభావంతో పని చేసే అధ్యాపకులు ఉన్నారని అయితే కళాశాల ఫ్లోరింగ్ దెబ్బతిని ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోగా ఫ్లోరింగ్‌కు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మరుగుదొడ్ల వినియోగంలోకి తేవాలి

రెబ్బెన: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రయాణికులు, ప్రజల కోసం నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల ప్రజలు ప్రతిరోజు ఏదో పని నిమిత్తం మండల కేంద్రానికి వస్తూ వెళ్తుంటారని అన్నారు. ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురాకపోవటంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఏడాది క్రితమే పనులు పూర్తయిన ఇప్పటి వరకు మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురాకపోవటం దురదృష్టకరమన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

పాతమంచిర్యాల: మంచిర్యాల గోదావరి నదీ తీరంలోని శ్రీ గౌతమేశ్వర ఆలయంలో, శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 21 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వ్రతాలు చేసుకున్న భక్తులకు పూజా సామగ్రితో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని బజ్జూరి శ్రీవాణి శ్రీనివాస్ దంపతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకురాలు శ్రీదేవి, ప్రోగ్రాం చైర్మన్ పడకంటి శ్రీనివాస్, వాసవీయూత్ క్లబ్ అధ్యక్షుడు తాటిపల్లి సాయివర్ధన్, జోన్ చైర్‌పర్సన్ నల్మాస్ ప్రవీణ్, నాయకులు చిలువేరు మహేష్, పల్లెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన



కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల జిల్లాలోని కాగజ్‌నగర్‌కు చెందిన అంగల తిరుపతిపై దాడి చేసిన ఖలీంను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. గురువారం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రఫత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, కృష్ణంరాజు, కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేందర్‌రావ్, తిరుమలాచారి, జర్నలిస్టులు సాయి, శ్రీధర్, సతీశ్, సురేష్, సోలంకి, మహేశ్ పాల్గొన్నారు.

దాడి చేసినవారిని శిక్షించాలి



మాట్లాడుతున్న గజ్జల లక్ష్మణ్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన అంగల తిరుపతిపై అకారణంగా దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్‌మాఫియా గుండాలు తిరుపతిపై దాడిచేశారని, వారిని శిక్షించాలన్నారు. సమావేశంలో నాయకులు సాంబయ్య, చంద్రయ్య, నంది రామన్న, వెంకటేశ్, గోపాల్, సంతోశ్, అనిల్, సాయి, హన్మంతు, రాజు, రాజశేఖర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా

కాగజ్‌నగర్‌రూరల్: నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ అల్లం రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లో నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమార్జనే ధ్యేయంగా అనుమతి లేకుండా విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా దుకాణాలు నడిపినా, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోయినా చర్యలు తప్పవన్నారు.

లోకారి(బి)లో వైద్య శిబిరం



వైద్య పరీక్ష చేస్తున్న సిబ్బంది



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామంలో గురువారం ఝరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సంజీవ్ గిరిజనులకు వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడం వలన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సంజీవ్, శ్రీదేవి, కల్పన, ప్రకాష్, వినోద్, మోహన్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో గురువారం రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటికీ తిరుగుతూ.. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఏఎన్‌ఎంలు సంగీత, సౌందర్య, ఆశ కార్యకర్త, పుష్ప, సుజాత పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

దండేపల్లి: ఈ నెల 24నుంచి 31వరకు జరగనున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు దండేపల్లిలో గురువారం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దండేపల్లిలో ప్రథమ సంవత్సరంలో 136, ద్వితీయ సంవత్సరంలో 38మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ఘనంగా బుద్ధ జయంతి



గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు



చీరలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప దంపతులు



వాంకిడిలో కొవ్వొత్తులతో ర్యాలీ

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని అంబేద్కర్ భవన్‌తోపాటు నాగమ్మ చెరువులోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద బుద్ధ పౌర్ణిమ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో పంచశీల జెండా ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి బస్టాండ్ మీదుగా నాగమ్మ చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. నాగమ్మ చెరువులోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుద్ధజయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధుడు చేసిన సేవలు, త్యాగాలను నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ కొనియాడారు. ప్రపంచ మానవాళికి శాంతి, సమానత్వం బోధించిన బుద్ధుడు అందరికీ అనుసరణీయమని గుర్తు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. శంకర్, హూక్లు, మారుతి, సుధాకర్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్, ఖమాన గ్రామంలోని నాగ్‌సేన్ బౌద్ధవిహార్‌లో అంబేద్కర్ యువజన సంఘం, సిద్ధార్థ యువజన సంఘం, నాగ్‌సేన్ బుద్ధిస్ట్ యువజన సంఘం, రమాబాయి మహిళా మండలి సంఘాల ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణిమ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. అంబేద్కర్ కూడళ్ల వద్ద పంచశీల జెండా ఆవిష్కరించారు. విహారాల్లో స్వీట్లు పంపిణీ చేశారు. సాయంత్రం కొవ్వొత్తులతో ప్రధాన వీధుల గుండా శాంతిర్యాలీ నిర్వహించారు. వాంకిడి బౌద్ధసమాజ్ అధ్యక్షుడు జైరాం, ఖమాన బౌద్ధసమాజ్ అధ్యక్షుడు జాడి శేఖర్, బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, నాయకులు ఉప్రె విజేయ్, దుర్గం శ్యాంరావు, దుర్గం వెంకట్‌రావు, టీమాజీ, సునీల్, జాడి తిరుపతి, రోషన్, విలాస్, పెంటు, శంకర్, మారుతి, మనోహర్ జాడి పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: అన్నదానం చేస్తున్న నాయకులు

కౌటాల: ముత్తంపేట, పార్డీ, కౌటాల, బోదంపల్లి, గుడ్లబోరి గ్రామాల్లోని బుద్ధ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహార్ సంఘం నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.



కౌటాల మండలం ముత్తంపేట్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో సమతా సొసైటీ, ది బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో మీరాబాయి దీక్షభూమిలో వేడుకలను నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాలంకరణ అనంతరం పంచశీల ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు దుర్గం జనార్దన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి డోంగ్రి గజానన్, ది బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, విశ్వాస్ జగతాప్, రమేశ్, పండరీనాథ్, మోహన్, రాంచందర్, శ్రీనివాస్, రవి, ప్రదీప్, చరణ్‌దాస్, చరణ్‌దాస్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న సభ్యులు

ధాన్యం కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లిరూరల్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల, బట్వాన్‌పల్లి గ్రామాల్లోని ధాన్యం కుప్పలను, కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ.. వరికోతలు అయి నెలలు గడుస్తున్నా, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ సంచులు అందుబాటులో ఉంచి, తరుగు లేకుండా ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేపట్టి, సన్న, దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోమాస అశోక్, మండల సీనియర్ నాయకులు చల్లూరి దేవదాస్, గోమాస బాపు, తిరుపతి, శ్రీకాంత్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

30లోపు యూనిఫాంలు అందించాలి



సభ్యులతో మాట్లాడుతున్న మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం తరుపున అందించే రెండు జతల యూనిఫాంలను ఈ నెల 30వ తేదీలోపు కుట్టి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ అన్నా రు. మంచిర్యాల మెప్మాలోని మహిళా సంఘ సభ్యులకు గాను రెండు జతల యూని ఫాంలను కుట్టి ఇచ్చేందుకు 30ప్రభుత్వ పాఠశాలల్లోని 4,032మంది విద్యార్థుల యూనిఫాంలను కుడుతున్నారు. కమిషనర్ మహిళా సభ్యులు కుడుతున్న యూ నిఫాంలను గురువారం ఆయన పరిశీలించి, తగిన సూచనలు చేశారు. మెప్మా చంద్రయ్య, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో వేసవి ఎండల తీవ్రత ఉపశమన చర్యల్లో భాగంగా గురువారం కార్మికులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. మేనేజర్ ప్రవీణ్ పాటింగ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్ రావు, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామానికి చెందిన యువకుడు గడ్డం రాకేశ్ ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం యువకులు పరామర్శించి రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు.